సామాజిక కథాంశాలకు పెద్దపీట

- 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన
- ఉత్తమ చిత్రంగా మలయాళీ సోషల్‌డ్రామా 'ఆట్టమ్'
- 'కాంతార'కుగాను ఉత్తమ నటుడిగా రిషబ్‌శెట్టి
- 'పొన్నియన్ సెల్వన్'కు నాలుగు అవార్డులు

70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను శనివారం కేంద్రం ప్రకటించింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలు గాను ఈ అవార్డులను ఎంపిక చేశారు. జాతీయ ఉత్తమ చిత్రంగా మలయాళ చిత్రం 'అట్టం' ఎంపికకాగా, జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం కన్నడ 'కాంతార' సినిమాలో అద్భుతమైన నటన కనపరచిన రిషబ్ శెట్టిని వరించింది. ఇక జాతీయ ఉత్తమనటి పురస్కారానికి తమిళ చిత్రం 'తిరుచిట్రంబళం' చిత్రానికి గాను నిత్యామీనన్, గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్' చిత్రానికి గాను మానసి పరేఖ్‌లను సంయుక్తంగా ఎంపిక చేశారు. తెలుగు సినిమా 'కార్తికేయ 2' ఉత్తమ ప్రాంతీయచిత్రంగా ఎంపిక కావడం విశేషం. ఈసారి మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్' చిత్రానికి సాంకేతిక విభాగాల్లో అవార్డుల పంట పండించింది. ఈ సినిమాకు నాలుగు అవార్డులు వరించాయి. 'ఉంచాయి' చిత్రానికిగాను సీనియర్ దర్శకుడు సూరజ్ భర్జత్యా ఉత్తమ దర్శకుడిగా పురస్కారానికి ఎంపికయ్యారు.

వ్యక్తిత్వం దర్శనం 'ఆట్టం'

మలయాళ సినిమా రివార్డులు ఏ స్థాయిలో దక్కించుకున్నా.. అవార్డులు మాత్రం తప్పకుండా జాతీయ స్థాయిలో గెలుస్తూనే ఉంది. యేటేటా ప్రకటించే జాతీయ పురస్కారాల్లో మలయాళ చిత్రాలు లేకపోవడం చాలా అరుదైన విషయం. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మలయాళ సినిమా జాతీయ పురస్కారాల్లో సత్తా చాటింది. ఆ సినిమానే 'ఆట్టం'. నిజానికి ఈ సినిమాలో తెలిసిన నటీనటులెవరూ లేరు. అందరూ కొత్త వాళ్లతో చేసిన ఈ సినిమా ఇంతటి ఘనత సాధించడానికి కారణం కేవలం కాన్సెప్ట్.

ఓ చిన్న ఊరిలో ఎవరికి తోచిన పని వారు చేసుకుంటూ.. తీరిక దొరికినప్పుడల్లా ఓ బృందంగా వివిధ వేదికల్లో నాటకాలు ప్రదర్శిస్తూ ఉండే ఓ 12మంది కళాకారుల కథ ఇది. వారిలో 11మంది మగవారైతే, ఒక్కరే స్త్రీ. ఆమె పేరు అంజలి. వీరిలో హరి అనే నటుడు సినిమాల్లో కూడా నటించి ఉండటంతో అతనికి ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది. దాంతో మిగతా వారు జెలసీగా ఫీలవుతుంటారు. ఓ రోజు వారు ప్రదర్శన తిలకించి ముగ్ధులైన విదేశీ జంట.. ఆ బృందం మొత్తానికి తమ రిసార్ట్‌లో పార్టీ ఏర్పాటు చేస్తుంది. ఆ పార్టీలో అందరూ మద్యం మత్తులో మునిగి తేలుతారు. కొంత సేపటికి ఎవరికి కేటాయించిన గదుల్లో వాళ్లు వెళ్లిపోతారు. అయితే.. అంజలి మాత్రం తన రూమ్‌లో కిటికి దగ్గరకెళ్లి అక్కడే కూర్చుని నిద్రపోతుంది. అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి అంజలి నిద్ర పోతున్న కిటికీ వద్దకు వచ్చి, కిటికీలో చేయి పెట్టి అంజలితో అసభ్యకరంగా ప్రవర్తించి, ముఖం చూపించకుండా పారిపోతాడు. ఆ వ్యక్తి వారి బృందంలోని వ్యక్తే అని తెలుస్తుంది. ఆ 11మందిలో ఆ వ్యక్తి ఎవరు? అతడ్ని ఎలా గుర్తించారు? అనేది మిగతా కథ.



వ్యక్తుల మనస్తత్వాలకు అద్దం పట్టేలా దర్శకుడు ఆనంద్ ఇకర్షి ఈ సినిమాను తెరకెక్కించాడు. ఒకే మనిషిలో ఉండే భిన్న వ్యక్తిత్వాలు ఇందులో ఆయన ఆవిష్కరించారు. మంచిగా కనిపించే మేకవన్నె పులులు, సందర్భాన్ని బట్టి రంగులు మార్చే ఊసరవెల్లులు, తమ మనుగడ కోసం సాటివారిని బలిపశువుల్ని చేసే గుంటనక్కలు.. ఇలా చాలామంది ఈ సినిమాలో కనిపిస్తారు. ఇందులో పాత్రలన్నీ నిత్యం సమాజంలో మనకు తారసపడేవే. సగటు మానవ స్వభావం ఇలా ఉంటుందని ఆనంద్ ఇకర్షి చూపించిన తీరు ఈ సినిమాకు జాతీయ పురస్కారాన్ని కట్టబెట్టింది. కథకు తగ్గట్టుగా పాత్రధారులు కూడా ఇందులో ఇమిడిపోయి నటించారు. అందరూ జీవించారనే చెప్పాలి. 1954లో వచ్చిన '12 యాంగ్రీ మెన్' హాలీవుడ్ టెలివిజన్ కార్యక్రమం ఆధారంగా దర్శకుడు ఆనంద్ ఇకర్షి ఈ సినిమాను తెరకెక్కించారు.

జాతీయ ఉత్తమనటి నిత్యామీనన్

'తిరుచిట్రంబళం' చిత్రానికి గాను జాతీయ ఉత్తమ నటిగా ఎంపికైంది నిత్యామీనన్. ఉత్తమనటిగా ఆమె అందుకున్న తొలి నేషనల్ అవార్డు ఇదే కావడం గమనార్హం. 'తిరుచిట్రంబళం' చిత్రానికి మిథరన్ ఆర్.జవహర్ దర్శకుడు. ధనుష్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా నిత్యమీనన్ 'శోభన' అనే అద్భుతమైన పాత్ర పోషించింది.

తిరు(ధనుష్), శోభన(నిత్య) ఇద్దరు చిన్నప్పట్నుంచి కలిసి పెరుగుతారు. ఇద్దరూ ప్రాణ స్నేహితులు. తిరుకి ఎలాగైనా ప్రేమ వివాహం చేసుకోవాలనే కోరిక. అందుకోసం నచ్చిన ప్రతి అమ్మాయికీ ట్రై చేస్తుంటాడు. దానికి శోభన హెల్ప్ చేస్తుంటుంది. కానీ ప్రతి అమ్మాయి దగ్గరా తిరుకు చేదు అనుభవాలే ఎదురువుతూవుంటాయి. తిరు అవస్థ చూసి శోభన కూడా చాలా బాధ పడుతూ ఉంటుంది. మరోవైపు తెలీకుండానే తిరును శోభన ఇష్టపడుతూవుంటుంది. కానీ తనను తిరు అలా చూడటం లేదు కాబట్టి, తన మనసులోనే ఆ ఇష్టాన్ని దాచుకుంటుంది తప్ప వ్యక్తీకరించదు. అయితే.. తిరు తాతయ్య మాత్రం వీరిద్దరి బంధంపై ఓ అభిప్రాయానికి వస్తాడు. 'నువ్వు చంకలో పిల్లాడ్ని పెట్టుకొని ఊరంతా వెతుకుతున్నావ్.. అసలు శోభనను ఎందుకు ట్రై చేయకూడదు?' అని తిరుకి చిన్న సైజు కౌన్సిలింగ్ ఇస్తాడు తాతయ్య. దాంతో శోభనను ట్రై చేయడం మొదలుపెడతాడు తిరు. ఉన్నట్టుండి మారిన తిరు ప్రవర్తన చూసి శోభన షాక్ అవుతుంది. తనముందే అంతమంది అమ్మాయిలను ట్రై చేసిన తిరు ప్రేమను ఎలా నమ్మాలో ఎలా అర్థం చేసుకోవాలో తెలీక శోభన సతమతమవుతుంది. చివరికి వీరి ప్రేమ ఎలా ఫలించింది? అనేది మిగతా కథ.

ఈ సినిమాలో ధనుష్, నిత్యామీనన్ పోటీపడి నటించారు. అటు స్నేహితురాలిగా, ఇటు ప్రేమికురాలిగా నిత్యా నటన స్కైలెవల్లో ఉంటుంది. ముఖ్యంగా పతాక సన్నివేశంలో నిత్యామీనన్ అభినయం ఈ సినిమాకే హైలైట్. ఓ మధ్య తరగతి అమ్మాయిగా, ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న విద్యావంతురాలిగా వివిధ కోణాల్లో నిత్యామీనన్ కనిపిస్తుంది. వినోదం, విషాదం, ప్రేమ.. ఇలా ఎన్నో ఉద్వేగాలున్న పాత్ర ఆమెది. స్వతహాగా మంచి నటి కావడంతో అద్భుతంగా నిత్యామీనన్ నటించింది. ఆ నటనకు సరైన పురస్కారం నేడు లభించింది.

కృష్ణతత్వానికి ప్రేక్షకుల జేజేలు

నిఖిల్ కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'కార్తికేయ-2' చిత్రం 70వ జాతీయ అవార్డుల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. విజయవంతమైన 'కార్తికేయ' సినిమాకు సీక్వెల్ ఇది. గత ఏడాది ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రతి ప్రశ్నకు ఓ సమాధానం ఉంటుందని, దానిని అన్వేషించడానికి ఎంతదూరమైన వెళ్లాలనే బలమైన సంకల్పం ఉన్న యువకుడు కార్తికేయ చేసిన సాహసభరితమైన ప్రయాణమే ఈ చిత్ర ఇతివృత్తం. శ్రీకృష్ణుడి చరిత్ర చుట్టూ ద్వారక నేపథ్యంలో అల్లుకున్న ఈ కథ ఆద్యంతం ఆధ్యాత్మికత, థ్రిల్లింగ్ అంశాల కలబోతగా సాగుతుంది. ద్వారకా నేపథ్యంతో పాటు శ్రీకృష్ణుడి తత్వాన్ని చర్చించడంతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాకు మంచి ఆదరణ దక్కింది.

రిషబ్‌శెట్టి అసాధారణ సినీ ప్రయాణం

కన్నడనాటి దర్శకుడిగా, నటుడిగా బహుముఖప్రజ్ఞతో రాణిస్తున్నారు రిషబ్ శెట్టి. ఆయన అసలు పేరు ప్రశాంత్‌శెట్టి. దక్షిణ కర్ణాటక మంగళూరు దగ్గరలోని కెరాడి అనే గ్రామంలో 1983లో జన్మించారు. బెంగళూరులో డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలో 'రంగసౌరభం' అనే నాటక బృందంలో నాటకాలు వేసేవారు. కుందాపురలో పాఠశాల రోజుల్లోనే నటనపై మక్కువతో యక్షగాన నేపథ్య నాటికల్లో నటించారు రిషబ్‌శెట్టి. కర్ణాటక ప్రభుత్వం ఫిల్మ్ అండ్ టీవీ ఇనిస్టిట్యూట్ నుంచి డైరెక్షన్‌లో డిప్లొమా పూర్తి చేసిన అనంతరం సినీ రంగంలోకి అడుగుపెట్టారు. తొలుత క్లాప్‌బాయ్, లైట్‌బాయ్, టచప్ మ్యాన్‌గా పనిచేసిన అనంతరం సహాయ దర్శకుడిగా మారారు. సినిమాల్లోకి రాకముందు జీవనం కోసం మినరల్ వాటర్, రియల్‌ఎస్టేట్, హోటల్ వ్యాపారాలు చేసి నష్టాలు చవిచూశారు. 'తుగ్లక్' (2012) చిత్రం ప్రతినాయక పాత్ర ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. 'రికీ' (2016) చిత్రంతో దర్శకుడిగా మారారు. నటుడిగా బెల్‌బాటమ్, గరుడ గమన వృషభ వాహన, హాస్టల్ హుడుగరు బేకద్దిరే వంటి చిత్రాలు వంటి చిత్రాలు మంచి గుర్తింపునిచ్చాయి. ఇక 'కాంతార'తో దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది. కిరిక్‌పార్టీ, సర్కారి హిరియా ప్రాథమిక శాలే కాసరగోడు వంటి చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటారు.

'కాంతార' సంచలనం

స్వీయ దర్శకత్వంలో రిషబ్‌శెట్టి నటించిన 'కాంతార' చిత్రం దేశవ్యాప్తంగా అద్భుత విజయం సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దైవిక అంశాలు, అడవి బిడ్డల అస్తిత్వ పోరాటం కలబోతగా ఈ చిత్రం అందరి మన్ననలు అందుకొంది. దక్షిణ కన్నడ ఆచార వ్యవహారాలు, ధార్మిక విశ్వాసాల నేపథ్యంలో ఈ సినిమా దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సొంతం చేసుకుంది. దక్షిణ కన్నడ సంస్కృతిలో అనాదిగా భాగమైన భూత కోల ఆరాధన, పంజుర్లి దేవత నేపథ్యంలో వచ్చిన సన్నివేశాలు ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లాయి. ఈ సినిమాలో శివ పాత్రలో రిషన్‌శెట్టి అద్భుతాభినయాన్ని కనబరిచాడు. ఈ చిత్రం అన్ని భాషల్లో భారీ విజయం సాధించింది. నాలుగు వందల కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది.

స్నేహితుల అందమైన ప్రయాణం 'ఉంచాయి'

సీనియర్ దర్శకుడు సూరజ్ బర్జాత్య తెరకెక్కించిన 'ఉంచాయి' చిత్రం నలుగురు స్నేహితుల భావోద్వేగభరిత కథగా ఆకట్టుకుంది. ఈ చిత్రానికిగాను సూరజ్ బర్జాత్య ఉత్తమ దర్శకుడిగా పురస్కారానికి ఎంపికయ్యారు. అమితాబ్ బచ్చన్, డానీ డెంజొప్పా, అనుపమ్ ఖేర్, బొమన్ ఇరానీ ప్రధాన పాత్రలను పోషించారు. తన స్నేహితుడి చివరి కోరికను నెరవేర్చడానికి అతడి చితాభస్మంని తీసుకొని హిమాలయాలకు వెళ్లిన స్నేహితుల కథతో ఆద్యంతం హృదయాన్ని స్పృశించింది.

'కార్తికేయ 2' సినిమా విడుదలై అద్భుతమైన విజయం సాధించినప్పుడు ఒక దర్శకుడిగా ఎంత ఆనందపడ్డానో, మళ్లీ ఇప్పుడు అంత ఆనందపడుతున్నా. ఈ అవార్డు నా బాధ్యత మరింత పెంచింది. ఎంపిక చేసిన జ్యూరీ మెంబర్స్‌కి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. 'కార్తికేయ 3' ప్రస్తుతం రైటింగ్‌లో ఉంది. అందరి అంచనాలను మించేలా ఈ సినిమా ఉంటుంది.. జై శ్రీకృష్ణ... **- దర్శకుడు చందూ మొండేటి**

70వ జాతీయ అవార్డుల విజేతలు..

- ఉత్తమ చిత్రం: ఆట్టమ్ (మలయాళం)
- ఉత్తమ నటుడు: రిషబ్‌శెట్టి (కాంతార)
- ఉత్తమ నటి: నిత్యమీనన్ (తిరుచిట్రంబళం-తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్-గుజరాతీ)
- ఉత్తమ ప్రాంతీయ చిత్రం: కార్తికేయ-2
- ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంచాయి)
- ఉత్తమ జనరంజక చిత్రం: కాంతార
- ఉత్తమ సహాయనటి: నీనా గుప్తా (ఉంచాయి)
- ఉత్తమ సహాయ నటుడు: పవన్‌రాజ్ మల్హోత్రా (ఫౌజా)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: రవివర్మన్ (పొన్నియన్ సెల్వన్)
- ఉత్తమ సంగీతం: ప్రీతమ్ (బ్రహ్మాస్త్ర)
- ఉత్తమ నేపథ్య సంగీతం: ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియన్ సెల్వన్)
- ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్: అర్జిత్‌సింగ్ (కేసరియా-బ్రహ్మాస్త్ర)
- ఉత్తమ ఫిమేల్ ప్లేబ్యాక్‌సింగర్: బొంబాయి జయశ్రీ (సౌది వెల్లక్క సీసీ 225/2009-మలయాళం)
- ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : బ్రహ్మాస్త్ర-1
- ఉత్తమ సౌండ్ డిజైన్: ఆనంద్ కృష్ణమూర్తి (పొన్నియన్ సెల్వన్-1)
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: నిక్కి జోషి (కచ్ ఎక్స్‌ప్రెస్)

ఎండకొడితే షూటింగ్ ఆపేశాం!

'మలయాళ భాషలో కథలు చాలా సహజంగా ఉంటాయని చెబుతారు. నేటివిటీకి వాళ్లు పెద్ద పీట వేస్తారు. అలాంటి కథలతో మనమెందుకు సినిమాలు చేయకూడదనుకున్నా. అదే సమయంలో 'ఆయ్' కథ నా దగ్గరకు వచ్చింది' అన్నారు నిర్మాత బన్నీ వాస్. జీఏ2 పతాకంపై నార్నే నితిన్ కథానాయకుడిగా ఆయన నిర్మించిన 'ఆయ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం బన్నీ వాస్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..

- ఈ సినిమా కథ విన్నప్పుడు రెండున్నర గంటలు నాన్‌స్టాప్‌గా నవ్వుకున్నా. ఇప్పుడు ప్రేక్షకులు కూడా అదేరీతిలో సినిమాను ఎంజాయ్ చేస్తన్నారు. దర్శకుడు అంజి కే మణిపుత్రది అమలాపురం దగ్గరలోని ఓ చిన్నపల్లెటూరు. అందుకే కథను అందులోని పాత్రలను చాలా సహజంగా తీర్చిదిద్దాడు. కోనసీమ అందాలను అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాడు
- వర్షంలో కోనసీమ మరింత అందంగా కనిపిస్తుంది. సినిమా చూస్తున్న ప్రేక్షకులు వర్షం తాలూకు అనుభూతి చెందాలని షూటింగ్ అంతా వర్షాకాలంలో ప్లాన్ చేశాం. మబ్బుపట్టినప్పుడే షూటింగ్‌కు వెళ్లేవాళ్లం. ఎండకొడితే షూటింగ్‌ను వాయిదే వేశాం. వర్షాన్ని ఈ కథలో ఓ భాగంగా భావించాం. అందుకే షూటింగ్ కాస్త ఆలస్యమైంది.
- కరోనా కంటే ముందే ఈ కథను ఓకే చేశాను. ఈ సినిమా కోసం టీమ్ మొత్తం చాలా ఎఫర్ట్స్ పెట్టాం. ఈ సినిమా యూత్‌తో పాటు ప్రతి ఒక్కరికి కనెక్ట్ కావాలనుకున్నాం. అందుకే ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్స్‌కు కూడా సమప్రాధాన్యత నిచ్చాం. నేను కథ విన్నప్పుడు ఎంతగా ఎంజాయ్ చేశానో ..సినిమా చూస్తున్న ప్రేక్షకులు కూడా అలాగే ఎంజాయ్ చేస్తున్నారు.
- హీరో నితిన్ తన పాత్రలో అద్భుతంగా నటించాడు. తనలోని టాలెంట్ ఏమిటో ఆయనకు బాగా తెలుసు. కథల విషయంలో ఆయన జడ్జిమెంట్ బాగుంటుంది. సినిమా కొస్తున్న ఆదరణ దృష్ట్యా షోస్ పెంచాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి. మేము కూడా అదే ప్రయత్నాల్లో ఉన్నాం. ఒకటిరెండు రోజుల్లో షోస్ పెంచుతాం.
- నేను జీవితంలో బంధుత్వం కంటే స్నేహానికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తాను. జీవితంలో ఈ స్థాయికి వచ్చానంటే స్నేహితులే కారణం. బన్నీగారితో పాటు చాలా మంది స్నేహితులు ప్రోత్సాహంతో సక్సెస్ అయ్యాను. అందుకే ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలోని 'ఆయ్' కథకు వెంటనే కనెక్ట్ అయ్యాను. చిన్న సినిమా తీసి పెద్ద సక్సెస్ కొట్టినప్పుడు కిక్ వేరుగా ఉంటుంది. ప్రస్తుతం మా బ్యానర్‌లో 'తండేల్' షూటింగ్ జరుగుతున్నది. డిసెంబర్‌లో రిలీజ్ అనుకుంటున్నాం. అదే నెలలో 'పుష్ప-2'కూడా రాబోతున్నది.

తాతామనవళ్లుగా తండ్రీకొడుకులు

బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ తాతా మనవళ్లుగా నటిస్తున్న చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్వీఎస్ నిఖిల్ దర్శకుడు. రాహుల్ యాదవ్ నక్కా నిర్మాత. ఈ సినిమాలోని బ్రహ్మానందం ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. సంప్రదాయ పంచెకట్టులో, హూందాగా నవ్వుతూ నడుస్తూవస్తున్న బ్రహ్మానందాన్ని ఈ లుక్‌లో చూడొచ్చు. ఈ నెల 19న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనున్నామని మేకర్స్ తెలిపారు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన మళ్లీరావా, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై కూడా అంచనాలు భారీగా ఉన్నాయని మేకర్స్ తెలిపారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హులక్కల్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, సంపత్, రాజీవ్ కనకాల కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య పిసపాటి.

వీరమల్లు పోరాటాలు



పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు'కు చెందిన కీలకమైన అప్‌డేట్ వచ్చేసింది. ఈ నెల 14 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించినట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ షెడ్యూల్‌లో స్టంట్ కొరియోగ్రఫర్ సిల్వ నేతృత్వంలో భారీ యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు వారు తెలిపారు. ఈ చిత్రీకరణలో దాదాపు 500మంది ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారని, మరికొద్దిరోజుల్లో పవన్‌కల్యాణ్ కూడా షూటింగ్‌లో పాల్గొంటారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. మునెపెన్నడూ చూడని విధంగా ఓ అద్భుతమైన యోధుడిగా పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని, ఆయన కెరీర్‌లోనే తొలి ఫిక్షనల్ మూవీ ఇదని, అన్ని కార్యక్రమాలనూ త్వరితగతిన పూర్తి చేసి త్వరలోనే 'హరిహరవీరమల్లు పార్ట్ 1'ను విడుదల చేస్తామని జ్యోతికృష్ణ తెలిపారు. బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం.రత్నం, నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.